సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 27 । మార్చి । 2024



అగ్ర వర్ణాల పేదల 'నేస్తం'..

కాపు సామాజిక వర్గానికి, అగ్రవర్ణ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలించింది. 8లో



ముగిసిన కల్యాణోత్సవాలు

అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి శ్రీ పుష్పయాగం (పుష్పాంజలి)తో ఘనంగా ముగిశాయి. 8లో



జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి..

8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ. 1.29 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 21 రోజులకు గానూ రూ.1,29,30,598 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రికసదన్‌లో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 89.900 గ్రాముల బంగారం, 9.350 కిలోల వెండి లభించినట్టు వెల్లడించారు. అలాగే స్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం రూ.8,10,455 వచ్చినట్టు పేర్కొన్నారు. పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ వచ్చినట్లు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ @ రూ.10వేల కోట్లు

ఆదాయార్జనలో ఆల్‌టైం రికార్డ్



తాటిచెట్లపాలెం: భారతీయ రైల్వేలో వాల్తేర్ డివిజన్ ఆల్‌టైం రికార్డ్ సాధించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10 వేల కోట్ల ఆదాయంతో రికార్డ్ సృష్టించింది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఐదు రోజుల ముందే ఈ రికార్డ్ సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారులను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అభినందించారు. మార్చి 26వ తేదీ వాల్తేర్ డివిజన్ చరిత్రలో నిలిచిపోయే రోజని, ఆర్థిక సంవత్సరానికి ముందే రికార్డు సాధించడం గర్వంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు 10 శాతం అధికంగా ఆదాయం సంపాదించినట్లు ఆయన వెల్లడించారు. వినియోగదారులను ఆకర్షించే ప్రణాళికలు, సన్నిహిత సంబంధాలు, నిర్వహణ సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలు మెరుగుపరచడం, అధికారులు, సిబ్బంది పని తీరుతో ఈ రికార్డ్ సాధ్యమైందని డీఆర్‌ఎం తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, భద్రతా కారణాలు, జరుగుతున్న అభివృద్ధి పనుల వల్ల కొంత ఆటంకం ఏర్పడినా.. అవరోధాలను ఎదుర్కొంటూ రికార్డ్ సాధించడం ఆనందంగా ఉందన్నారు.

రేపు ఫ్యామిలీ కౌన్సెలింగ్

విశాఖసిటీ: కుటుంబ సమస్యల పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగర పోలీస్ కమిషనరేట్ జోన్–1 పరిధిలో భార్యాభర్తల, కుటుంబ సభ్యుల సమస్యలు పరిష్కారం కోసం ప్రతీ గురువారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర పోలీస్ బ్యారెక్స్ ప్రాంతంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానం పోలీస్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. టూ టౌన్, త్రీ, ఫోర్త్, మహారాణిపేట, ద్వారకా, ఎంవీపీ, ఆరిలోవ, పీఎంపాలెం, ఆనందపురం, భీమిలి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉండే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ కోరారు.

న్యాయవాదుల డ్రెస్ కోడ్‌లో మార్పు

విశాఖ లీగల్: వేసవి దృష్ట్యా న్యాయవాదులు డ్రెస్ కోడ్‌ను మార్పు చేస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత తెలిపారు. న్యాయవాదులు కేవలం బ్యాండ్స్ ధరించి న్యాయస్థానాలకు హాజరు కావచ్చని, ఈ వెసులుబాటు వచ్చే జూలై 15వ తేదీ వరకు ఉంటుందని ఓ ప్రకటనలో తెలిపారు.

28న బార్క్ డైరెక్టర్ రాక

మహారాణిపేట: బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్) డైరెక్టర్ వివేక్ బాసిన్ ఈ నెల 28న విశాఖ వస్తున్నారు. ముంబయి నుంచి విమానంలో గురువారం సాయంత్రం 4.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఉన్న విశాఖ సదన్‌లో ఆయన బస చేస్తారు. 29న అధికారిక పర్యటనలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు విమానంలో బయలుదేరి ముంబయి వెళతారు.

సీ–విజిల్ కంట్రోల్ రూమ్‌కి వచ్చిన అలెర్ట్ మెసేజ్

సర్.. ఇదిగో ఈ ఫొటో చూడండి.. ఓల్డ్ డెయిరీఫాం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున పంచుతున్నారు. చర్యలు తీసుకోండి. అని అందులో సారాంశం. అయితే ఆ ఫొటోలో డబ్బులు పంచుతున్నట్లు ఎక్కడా లేదు. జనం గుమిగూడినట్లు ఉంది. తప్పుడు సమాచారం అని సిబ్బందికి అర్థమైంది. కానీ.. నిర్దేశించిన కాలపరిమితిలోగా.. సమస్యపై స్పందించాల్సిందే... వెంటనే ఆదర్శనగర్‌కు నలుగురితో కూడిన బృందాన్ని ఓ ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్‌ని పంపించారు. అక్కడ **ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని నిర్ధారించుకున్నారు.**

మరుసటి రోజు.. ఆదర్శనగర్‌లో వైఎస్సార్ సీపీ నేతలు డబ్బులు పంచుతున్నారంటూ బ్లర్‌గా ఉన్న ఫొటో పంపించారు. మళ్లీ అదే సీన్.. అక్కడా ఏమీ లేదు. కానీ ఎన్నికల సిబ్బంది ఉసూరుమంటూ తిరిగి **ఆఫీస్‌కు చేరుకున్నారు.**

తగరపువలసలో పార్టీ రంగులతో లైటింగ్ ఏర్పాటు చేశారు. చర్యలు తీసుకోవాలి అంటూ మరో ఫిర్యాదు. ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడికి వెళ్లి చూడగా.. శివాలయంలో పెళ్లి వేడుక జరుగుతోంది. అందుకోసం రకరకాల రంగులతో లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ ఫిర్యాదునీ **కొట్టేయ్యాల్సిన పరిస్థితి.**

కప్పరాడలో వైఎస్సార్‌సీపీ నేతలు అనుమతి లేకుండా కాన్వాయ్‌తో వెళ్తున్నారంటూ ఎలాంటి ఆధారాలు కనిపించని అస్పష్టమైన వీడియో పెట్టారు. వెంటనే సర్వైలెన్స్ టీమ్ అక్కడికి చేరుకుంది. తీరా చూస్తే.. అది సర్వీస్ రోడ్డులో వరుసగా వెళ్తున్న **కార్లుగా గుర్తించారు.**

ఏదో విధంగా అధికార పార్టీని ఇరుకున పెట్టేందుకు టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదుల్లో కొన్ని ఇవి.

పచ్చ నేతలు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఎన్నికల్లో పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను ఒత్తిడికి గురి చేస్తున్నారు. రోజూ ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. వీరి అడ్డగోలు వైఖరి, అనాలోచిత వ్యవహారాల కారణంగా సక్రమంగా విధులు నిర్వర్తించేందుకు కూడా శ్రమించాల్సి వస్తోంది.

అక్కసుతో ఆటలు

- తప్పుడు ఫిర్యాదులతో తిప్పలు
- సీ–విజిల్‌కు అడ్డగోలుగా ఫిర్యాదులు చేస్తున్న టీడీపీ శ్రేణులు
- ప్రతి ఫిర్యాదును 100 నిమిషాల్లో పరిష్కరించాలన్న నిబంధన
- పరుగులు పెడుతున్న ఎన్నికల అధికారులు
- 133 ఫిర్యాదుల్లో 37 ఈసీ పరిధిలోకి రానివే..
- తప్పుడు ఫిర్యాదులతో ఇబ్బందులకు గురిచేయొద్దంటున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేవారిపై రియల్ టైమ్‌లో ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్ తీసుకొచ్చింది. ఈ యాప్ సహాయంతో పోలింగ్ స్టేషన్‌లో అనుమానాస్పద వ్యక్తులు, అవకతవకలకు సంబంధించి ఓటర్లు ఫిర్యాదు చేయవచ్చు. మద్యం, డబ్బు పంపిణీ, ఫేక్ న్యూస్, విద్వేషపూరిత ప్రసంగాలు, పరువు నష్టం, పోస్టర్లు, బ్యానర్లు, అనుమతి లేకుండా గిఫ్ట్ కూపన్ల పంపిణీ, అనుమతి లేకుండా వాహనాల ర్యాలీలు, నిషేధిత సమయాల్లో ప్రచారం, నిర్ణీత సమయానికి మించి స్పీకర్లను ఉపయోగించడం వంటి వాటిపై ఫిర్యాదులు చేయవచ్చు. ఇందులో ఫొటో, వీడియో, ఆడియో అప్‌లోడ్ చేసి, వెంటనే ఫిర్యాదు నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందులో ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో పరిష్కరించాల్సి ఉంది. ఫిర్యాదు వచ్చిందంటే ఎన్నికల సిబ్బంది కచ్చితంగా ఆ ప్రాంతానికి వెళ్లాల్సిందే. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయాలన్నదే ఎలక్షన్ కమిషన్ ప్రధాన ఉద్దేశం. కానీ టీడీపీ శ్రేణులు ఆ ఉద్దేశాన్ని దురుద్దేశపూర్వకంగా వినియోగిస్తున్నారు.

లేనిపోని ఆరోపణలతో ఫిర్యాదులు

వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై తప్పుడు ఫిర్యాదులు చేయాలని టీడీపీ నేతలు కంకణం కట్టుకున్నారు. లేనిపోని ఆరోపణలతో నిత్యం ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. దీంతో ఆ ప్రాంతాలకు వెళ్లి.. అక్కడ ఏమీ లేదని నిర్ధారించుకొని ఎన్నికల సిబ్బంది నివేదికలు సిద్ధం చేస్తున్నారు. **కేవలం వైఎస్సార్ సీపీపై అక్కసుతో అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో ఆటలాడుకుంటున్నారు. సీ–విజిల్‌కు 133 వరకూ ఫిర్యాదులు రాగా.. ఇం**దులో 96 ఫిర్యాదులను ఆయా ప్రాంతాలకు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సర్వైలెన్స్ టీమ్స్, ఎంసీసీ బృందాలు వెళ్లి పరిష్కరించాయి. 37 తప్పుడు ఫిర్యాదులుగా తేలాయి. ఇలాంటి ఫిర్యాదులతో ఎన్నికల సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

వెలగపూడి ఇలాఖాలో ఎక్కువగా..

ఎన్నికలంటే చాలు.. తన పాత వృత్తయిన నేరపూరిత కుయుక్తులతో వెలగపూడి రామకృష్ణబాబు అందరి జీవితాలతో ఆటలాడుకోవడం పరిపాటిగా మారిపోయింది. దొంగఓట్లు చేర్పించడం.. రిగ్గింగ్‌లకు పాల్పడటం వంటి చరిత్ర ఉన్న వెలగపూడి నియోజకవర్గమైన విశాఖ తూర్పు నుంచే ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. అదేవిధంగా.. దక్షిణం, భీమిలి నుంచి కూడా తప్పుడు ఫిర్యాదులు వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై బురదజల్లేందుకు టీడీపీ కూటమి అభ్యర్థులు వ్యవహరించడంపై ఎన్నికల సిబ్బంది బలవుతున్నారు.



సీ-విజిల్ కంట్రోల్ రూమ్

తప్పుడు ఫిర్యాదులు చేయవద్దు



ఫిర్యాదులపై ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలలోగా జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఫిర్యాదులన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతున్నాం. సీ–విజిల్, కంట్రోల్ రూమ్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదుకు సంబంధించి క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి.. ఆధారాలతో నివేదిక తయారు చేస్తున్నాం. ఎన్నికల వ్యయంతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో బృందాలు, మొబైల్ బృందాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల ప్రవర్తన నియామవళిని అమలు చేసేందుకు 18 ఎంసీసీ బృందాలు, 23 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 18 వీఎస్‌టీ బృందాలు చొప్పున మొత్తం 59 ఏర్పాటు చేశాం. అయితే.. తప్పుడు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. దీనివల్ల మానవ వనరులతో పాటు ప్రజాధనం, సమయం వృథా అవుతోంది. దయచేసి ఎవరూ తప్పుడు ఫిర్యాదు చేయవద్దు.

– డా.మల్లికార్జున, జిల్లా ఎన్నికల అధికారి

పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు సోపానాలు

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ

తగరపువలస : రాష్ట్రంలో గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు సోపానాలు అవుతాయని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి చెరకుపల్లి అవంతి కళాశాల ఎదురుగా ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం అత్యవసరమన్నా రు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సాయం అందించిన ముఖ్యమంత్రి దేశంలో మరెవరూ లేరన్నారు. వైఎస్సార్‌సీపీతోనే కార్యకర్తలు, నాయకులకు గౌరవం వచ్చిందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధి చేకూరితేనే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరాలన్నారు. భీమిలి ఎమ్మెల్యే, విశాఖ ఎంపీ అభ్యర్థులు గా ప్రతిపక్షాల నుంచి ఎవరు పోటీ చేసినా భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎల్లో మీడియాలో ప్రచురితమయ్యే వార్తలన్నీ అవాస్తవాలే అన్నారు. వాటిని పట్టించుకోవాల్సిన పని లేదన్నారు. భీమిలిలో 1.5 లక్షల కుటుంబాలను కలిసి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతోపాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి తరపున ఇక్కడి ప్రజల ఆశలు నెరవేరుస్తామన్నారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో ప్రజలకు రూ.4,500 కోట్ల విలువైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించామన్నారు. విపక్షాల నుంచి ఎవరు పోటీకి వచ్చినా మన సత్తా చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, జిల్లా వ్యవసాయశాఖ సలహాదారుడు దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శులు జీరు వెంకటరెడ్డి, మద్దిల వెంకటరమణ, సచివాయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, మండల, జీవీఎంసీ వార్డుల అధ్యక్షులు చిల్ల భాస్కరరెడ్డి, జగుపల్లి ప్రసాద్, గాడు శ్రీను, అల్లిపల్లి నరసింగరావు, జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, కదిరి ఎల్లాజీ, కొప్పల రమేష్, జీరు సుజాత, చిల్ల ప్రమీల, యూత్ అధ్యక్షుడు చిల్ల హరి, అక్కరమాని చినబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మజ్జి సూరినాయుడు, చెల్లూరి పైడప్పడు, చెల్లూరి నగేష్, సమ్మిడి శ్రీనివాసరావు, శిరిగిడి సంతోషి, లచ్చుబుగత జగదీశ్వరరావు, బోని సన్నిబాబు, కేపీ సత్యనారాయణ, చంద్రశేఖర్, ప్రభాకర్, ఈశ్వరరావు, అప్పలరాజు, దుర్గారావు, కొయ్య రామకృష్ణారెడ్డి, కొల్లి కోటిరెడ్డి, వెంపాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

బీసీలకే అగ్రపీఠం

- జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదు వెనుకబడిన వర్గాలవారికే..
- కొప్పుల వెలమలకు అనకాపల్లి పార్లమెంట్, మూడు అసెంబ్లీ టికెట్లు
- బూడి ముత్యాలనాయుడు, అనురాధల ఎంపికతో జిల్లా అంతటా హర్షాతిరేకాలు



బూడి ముత్యాలనాయుడుకు స్వీట్లు తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అనకాపల్లి: బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్ బోన్.. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరచూ చెప్పే మాట. చెప్పడమే కాదు చేసి చూపించారు.. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఐదింట బీసీ వర్గాలకు చెందిన నేతలను అభ్యర్థులుగా ఎంపిక చేసి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. అనకాపల్లి ఎంపీ సీటుతోపాటు నర్సీపట్నం, పెందుర్తి, మాడుగుల, అనకాపల్లి, చోడవరం అసెంబ్లీ టికెట్లు బీసీలకు కేటాయించారు. ఇందులో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా తాజాగా ప్రకటించిన బూడి ముత్యాలనాయుడితోపాటు నర్సీపట్నం, పెందుర్తి, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థులు పెట్ల ఉమాశంకర గణేష్, అదీప్ రాజు, ఈర్లె అనురాధ కొప్పుల వెలమ కులస్తులు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన సామాజికవర్గమిది. ఉమ్మడి విశాఖలో కొప్పుల వెలమలకు కూటమి పార్టీలు ఒక్క ఎంపీ సీటూ కేటాయించలేదు. తన కుమారుడికి టికెట్ ఇవ్వాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కోరినా టీడీపీ పట్టించుకోకుండా కొప్పుల వెలమలపై వారికున్న చిన్న చూపును బయటపెట్టుకుంది. కడప జిల్లాలో ఓసీ వెలమకు చెందిన సి.ఎం.రమేష్‌ను అనకాపల్లి ఎంపీ స్థానానికి ఎంపిక చేసి బీజేపీ తన నైజం బయటపెట్టుకుంది.

లోకల్ బీసీ వెలమ వెర్సస్ నాన్ లోకల్ ఓసీ వెలమ : అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అంటే ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇక్కడ ప్రజలు స్థానికతకే అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఎక్కువగా కాపు, గవర, వెలమ కులస్తులే ఎంపీగా పోటీ చేస్తున్నారు. నాన్‌లోకల్ అభ్యర్థులను ఇక్కడి ప్రజలు తిరస్కరిస్తున్నారు. గతంలో పీఆర్‌పీ నుంచి అనకాపల్లి ఎంపీగా పోటీ చేసిన చిరంజీవి బావ అల్లు అరవింద్‌ను ఓడించారు. అప్పుడు కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కొప్పుల వెలమకు చెందిన సబ్బం హరిని ఇక్కడి ప్రజలు గెలిపించారు. 2009 తరువాత మళ్లీ అనకాపల్లి పార్లమెంట్ బరిలో లోకల్ వెర్సస్ నాన్‌లోకల్ పోటీ నెలకొంది. వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు బరిలో దిగితే.. కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా సీఎం రమేష్ పోటీ చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో కొప్పుల వెలమ సామాజికవర్గం ఓట్లకు గేలం వేయడానికి చంద్రబాబు కూటమి ఎత్తుగడ వేసింది. కానీ సీఎం రమేష్ ఓసీ వెలమకు చెందినవారు. ఉత్తరాంధ్రలో ఉన్న కొప్పుల వెలమ, రమేష్ ఓసీ వెలమ ఒకటి కాదు. తెలంగాణ ప్రాంతంలోని ఓసీ వెలమకు చెందిన వారు సీఎం రమేష్. రానున్న ఎన్నికల్లో లోకల్ వెర్సస్ నాన్‌లోకల్ పోటీ ఉంటుంది. కొప్పుల వెలమలకు ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధిని, విస్మరించిన ప్రతిపక్ష కూటమి దగాకోరుతనాన్ని బీసీలు కచ్చితంగా గుర్తు పెట్టుకుంటారు.

స్పాట్‌కు డుమ్మాపై సీరియస్..!

- విధులకు హాజరుకాని 315 మందికి షోకాజ్ నోటీసులు
- మూల్యాంకనంపై కార్పొరేట్ నిర్లక్ష్యం
- అధ్యాపకులను పంపేందుకు నిరాకరిస్తున్న యాజమాన్యాలు
- తీవ్రంగా పరిగణిస్తోన్న ఇంటర్ బోర్డు అధికారులు
- గడువులోగా మూల్యాంకనం పూర్తి చేసేలా ఫోకస్

విశాఖ విద్య : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్‌కు కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల అధ్యాపకులు డుమ్మా కొడుతున్నారు. జవాబు పత్రాల మూల్యాంకనానికి అధ్యాపకులను రానివ్వకుండా కాలేజీ యాజమాన్యాలు మోకాలడ్డుతున్నాయి. దీంతో మూల్యాంకన ప్రక్రియ జాప్యమౌతుండటంతో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. మూల్యాంకనం విధులకు హాజరు కాని 315 మంది అధ్యాపకులను గుర్తించి, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సదరు కాలేజీ యాజమాన్యాలతో మంగళవారం ఆర్‌ఐవో మురళీధర్ సమావేశమయ్యారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

జిల్లాకు 4.74 లక్షల జవాబు పత్రాలు

నగరంలోని జైల్ రోడ్‌లో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన శరవేగంగా జరుగుతోంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 4.74 లక్షల ఆన్సర్ స్క్రిప్టులకు అధ్యాపకులు వాల్యుయేషన్ చేస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువులోగా మూల్యాంకనం పూర్తి చేసేలా 2 వేల మంది అధ్యాపకులకు ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్లుగా నియమించారు. ఫలితాలు సకాలంలో ప్రకటించే క్రమంలో మార్చి 4 నాటికి మూల్యాంకన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

యాజమాన్యాల నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులకు నీట్, ఏపీ ఈఏపీ సెట్, జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్‌డ్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ కల్పిస్తున్న కారణంగా అధ్యాపకులను రిలీవ్ చేయకుండా స్పాట్ వాల్యుయేషన్‌కు కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు మోకాలడ్డుతున్నాయి. సబ్జెక్టుల వారీగా స్పాట్ వాల్యుయేషన్‌కు విధులకు నియమించిన అధ్యాపకులు పూర్తి స్థాయిలో విధులకు హాజరు కావడం లేదు. స్పాట్ విధులకు నియమించిన అధ్యాపకుల్లో కెమిస్ట్రీ – 116, ఫిజిక్స్ – 78, గణితం – 86, ఇంగ్లిష్ – 35 మంది హాజరు కాలేదు. స్పాట్ వాల్యుయేషన్ విధులకు బోర్డు ద్వారా ఆర్డర్లు అందుకున్న అధ్యాపకులు విధిగా హాజరు కావాల్సి వుండగా, కళాశాలల ప్రిన్సిపాల్స్ వారిని రిలీవ్ చేయడం లేదు.

షోకాజ్ నోటీసులు జారీ చేశాం

స్పాట్ వాల్యుయేషన్ విధులకు గైర్హాజరవుతున్న అధ్యాపకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఇలానే కొనసాగితే, రోజుకు రూ.వెయ్యి చొప్పున ఆయా కాలేజీ యాజమాన్యాలకు జరిమానా విధిస్తాం. బోర్డు అధికారులు నిర్దేశించిన గడువులోగా మూల్యాంకనం పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– మురళీధర్, ఆర్ఐవో, క్యాంప్ ఇన్‌చార్జి

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మహారాణిపేట: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వేసవిలో తాగునీటి అవసరాల సన్నద్ధత అంశాలపై జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. జీవీఎంసీ, ఆర్.డబ్ల్యూఎస్, నీటి వనరులు, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి సౌలభ్యాన్ని అంచనా వేసుకొని, ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి బోర్లు, మోటార్లు, పైపులు, ట్యాపుల మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు వృథా కాకుండా నీటి వనరులు, వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏలేరు నుంచి అధిక శాతం నీటిని నగర అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. కొన్నింటిలో నీటిసాంద్రత తక్కువగా ఉందని కలెక్టర్‌కు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏలేరు నుంచి మేహాద్రి గెడ్డకు పంపింగ్ ద్వారా నీటిని పంపించేలా తొలిసారి ప్రయత్నం చేయనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 15 నుంచి జూలై వరకు ఈ ప్రయోగం చేయడం ద్వారా రోజుకు అదనంగా 50 క్యూసెక్కుల నీటిని విశాఖ ప్రజలు వినియోగించుకునే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ కె.వి.వి.చౌదరి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, జీవీఎంసీ వాటర్ సప్లయ్ పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎన్.రవి, వాటర్ రిసోర్సెస్ పర్యవేక్షక ఇంజినీర్ కె.సూర్య కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

నారసింహా.. శరణు శరణు

సింహగిరిపై నృసింహా మహా యజ్ఞానికి శ్రీకారం

సింహాచలం: సింహగిరిపై సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. తొలుత నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులంతా రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారం జరిపారు. అనంతరం చక్రపెరుమాళ్లను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధిగా త్రిపురాంతక స్వామి ఆలయ సమీపంలో ఉన్న పుట్ట బంగార మండపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చక్రపెరుమాళ్లను అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం నిర్వహించారు. అనంతరం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పుట్టమన్నును శిరస్సుపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం చక్రపెరుమాళ్‌ని, పుట్టమన్నుని యాగశాలలోకి తీసుకెళ్లారు. ఇక్కడి వేదికపై చక్రపెరుమాళ్లని అధిష్ఠింపజేసి, తదుపరి పాలికల్లో పుట్టమన్నుని వేసి అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, విశిష్ట దాతలు బోకం శ్రీనివాస్, కె.సాయికుమార్ పాల్గొన్నారు.



పుట్టమన్నును శిరస్సుపై పెట్టుకుని ఆలయంలోకి తీసుకెళ్తున్న స్థానాచార్యులు, అర్చకులు

రుత్వికులు రాక : యజ్ఞంలో పాల్గొనేందుకు మంగళవారం ఉదయానికే ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు రాష్ట్రం నుంచి పలువురు రుత్వికులు సింహగిరికి చేరుకున్నారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన రుత్విక్‌వరణం, ఉత్సవాంగీకారం తర్వాత దేవస్థానం ఈవో శ్రీవానిసమూర్తి వారికి దీక్షా వస్త్రాలు అందజేశారు.

నేటి నుంచి యజ్ఞం ప్రారంభం : శ్రీనృసింహ మహా యజ్ఞంను బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి జరగనుంది. వచ్చేనెల ఒకటో తేదీ ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో యజ్ఞం పరిసమాప్తవుతుంది. విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్రసరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం శ్రీనృసింహయజ్ఞంను తిలకించేందుకు సింహగిరికి రానున్నారు.


అగ్ర వర్ణాల పేదల 'నేస్తం'..

కాపులంటే చంద్రబాబుకు కరివేపాకులు. రిజర్వేషన్ల పేరిటే కాదు.. దగాకోరు హామీలతోనూ సున్నం పెడితే.. సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారిని అక్కున చేర్చుకున్నారు. మాట ఇవ్వకపోయినా కాపు నేస్తంతో స్నేహ హస్తం అందించారు. ఇతర అగ్రవర్ణ పేదలకు సైతం ఈబీసీ నేస్తం సాయమందించి ఆపద్బాంధవులయ్యారు.

- మేనిఫెస్టోలో చెప్పిన దాని కంటే మిన్నగా మేలు
- కాపు నేస్తం, ఈబీసీ నేస్తం కింద ఏటా రూ.15 వేల సాయం
- వైఎస్సార్‌సీపీ పాలనలో నాలుగు విడతల్లో రూ.60 వేల లబ్ధి
- కాపు, అగ్రవర్ణ పేదలనూ దగా చేసిన తెలుగుదేశం ప్రభుత్వం


కాపు నేస్తం నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం, తగరపువలస, కంచరపాలెం, మద్దిలపాలెం: ఎన్నికల మేనిఫెస్టోలో లేకు న్నా.. ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ కాపు సామాజిక వర్గానికి, అగ్రవర్ణ సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన గ్రామీణ, పట్టణ మహిళల వికాసానికి తోడ్పాటునందించింది. కాపు కార్పొరేషన్ ద్వారా 'వైఎస్సార్ కాపు నేస్తం'పేరిట 45 నుంచి 60 ఏళ్లలోపు కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలకు ఏటా రూ.15వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.60 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఇదే మొత్తాన్ని 'ఈబీసీ నేస్తం'పేరిట బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, రెడ్డి కులాల్లో పేదలకు అందించింది.



కాపు, అగ్రవర్ణ పేదలపై టీడీపీ శీతకన్ను..

గత తెలుగుదేశం ప్రభుత్వం కాపు సామాజిక వర్గం, అగ్రవర్ణ పేదలపై శీతకన్ను వేసింది. కాపు రిజర్వేషన్ల విషయంలోనూ దగా చేసింది. సంవత్సరానికి రూ.వెయ్యి కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.ఐదు వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకుండా వంచించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కాపు కార్పొరేషన్ ద్వారా ఏడాదికి రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొనగా, అంతకంటే మిన్నగా మేలు చేయడం గమనార్హం. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో విశాఖ జిల్లాలో కాపు నేస్తం కింద 59,778 మందికి గానూ రూ. 89.66 కోట్లు, ఈబీసీ పథకం కింద 22,731 మంది లబ్ధిదారులకు రూ.34.09 కోట్లు, అనకాపల్లి జిల్లాలో 67,131 మందికిగానూ రూ.100.69 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 11,605 మందికి రూ.17.40 కోట్లు, అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో కాపు నేస్తం కింద 3,453 మందికి రూ.5.17 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 1,232 మంది లబ్ధిదారులకు రూ.18.4 లక్షలు సాయమందించింది.

కాపునేస్తం	విడతల వారీగా లబ్ధిదారులు	ఆర్థిక సాయం (లక్షల్లో)
ఫేజ్-1	23,784	రూ. 3,567.60
ఫేజ్-2	21,177	రూ. 3,176.55
ఫేజ్-3	7,169	రూ. 1,075.35
ఫేజ్-4	7,648	రూ. 1,147.20
మొత్తం	59,778	రూ. 8,966.70

చీకూచింత లేకుండా జీవిస్తున్నాం



నా పేరు రంగూరి లక్ష్మి. భీమిలి జోన్ కార్మికవాడలో నివాసం ఉంటున్నాను. నేను ఇంటి వద్దే పువ్వుల వ్యాపారం, విస్తరాకులు కుట్టడం తదితర పనులు చేస్తుంటాను. ఇంటి ఖర్చులకు గానూ రోజుకు రూ.100 నుంచి రూ.300 వరకు ఆదాయం వస్తుంది. నా భర్త రాంబాబు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఆయనకు వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా నెలకు రూ.3వేలు అందుతోంది. నాకు కాపు నేస్తం పథకం ద్వారా రూ.60 వేలు, వైఎస్సార్ ఆసరా కింద రూ.29 వేలు, ఆనందపురం మండలం బాకూరుపాలెం వద్ద విలువైన ఇంటి స్థలం లభించింది. ఈ పథకాలతో భార్యాభర్తలం ఏ చీకూచింత లేకుండా జీవిస్తున్నాం. ఇప్పుడు మాకు అందుతున్న పథకాలేవీ గత ప్రభుత్వాల హయాంలో రాలేదు.

సీఎం జగన్‌తో సమన్యాయం



నా పేరు మేకల జానకి. కొత్తపేట. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే కాపు సామాజిక వర్గానికి న్యాయం జరిగింది. గతంలో చంద్రబాబు రుణమాఫీ పేరుతో మహిళలను వంచనకు గురి చేశారు. ఎవరికీ అంగుళం ఇంటి స్థలం ఇవ్వలేదు. కాపులకు ఎలాంటి భరోసా కల్పించలేదు. నా వరకు చూసుకుంటే కాపు నేస్తం పథకం కింద రూ.60 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.17,500, విలువైన ఇంటి స్థలం లభించింది.

మాకూ ప్రాధాన్యమిచ్చారు



నా పేరు తిరంశెట్టి పార్వతి. చిట్టివలస. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సామాజిక వర్గాల వారికి లబ్ధి చేకూర్చినట్టే.. మాకూ ప్రాధాన్యమిచ్చి ఆదుకున్నారు. సమన్యాయ పాలన జరిగింది. గతంలో కాళ్లరిగేలా తిరిగినా రాని ఇంటి స్థలం ఈ ప్రభుత్వంలో వచ్చింది. నాకు కాపు నేస్తం, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.70 వేల వరకు లబ్ధి కలిగింది.

చిరువ్యాపారంతో జీవనభృతి



నా పేరు మధుపాడు ఉమ. జీవీఎంసీ 22వ వార్డు బలరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాను. ఇద్దరు ఆడపిల్లలతో చాలీచాలని ఆదాయంతో కాలం వెళ్లదీస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కాపునేస్తం పేరిట పథకాన్ని పెట్టి ఆదుకున్నారు. ఏటా రూ.15వేలు చొప్పున రూ.60 వేలు జమ చేసి ఆర్థికభరోసా కల్పించారు. ప్రభుత్వ సాయంతో ఇంటి వద్దనే చిన్న దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. తద్వారా వచ్చిన ఆదాయంతో ఇల్లు గడుస్తోంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

కులమతాలకు అతీతంగా సంక్షేమం



నా పేరు అడపా కనక. తగరపువలస. రాష్ట్రంలో బలహీన వర్గాలకు న్యాయం చేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమే. మమ్మల్ని ఓటు బ్యాంకుగా కాకుండా చూసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. కలలో కూడా ఊహించని విధంగా కాపు మహిళలకు కాపునేస్తం ద్వారా రూ.60 వేలు అందించారు. విలువైన ఇంటి స్థలం ఇచ్చారు. నా భర్తకు వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే..

చేదోడుగా కాపు నేస్తం



నా పేరు పోతినేటి తాయారమ్మ. కప్పరాడ రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్నాం. నా భర్త సత్యనారాయణరావు రోజు కూలీ. నాకు ప్రభుత్వం అమలు చేసిన 'కాపు నేస్తం 'చేదోడుగా నిలిచింది. ఏటా రూ.15 వేలు చొప్పున నాలుగేళ్లలో రూ.60వేలు అందింది. పిల్లల చదువులకు విద్యా దీవెన, నా కుమారుడికి దివ్యాంగుల పింఛన్ అందుతోంది. గత టీడీపీ పాలనలో దరఖాస్తులు చేసుకున్నా.. సంక్షేమ పథకాలు అందలేదు. మా కుటుంబం మొత్తం సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

ఈబీసీ నేస్తం(మూడు విడతల్లో)

విశాఖ జిల్లా లబ్ధిదారులు
22,731 మంది
లబ్ధి రూ.3409.65 లక్షలు

జపాన్ ప్లాజాలో నిషేధిత ఈ–సిగరెట్లు

- పోలీసుల తనిఖీల్లో 21 ప్యాకెట్ల లభ్యం
- షాపు నిర్వాహకుడు అబ్దుల్ ఖాదర్ అరెస్ట్

విశాఖ సిటీ: నగరంలో నిషేధిత ఈ–సిగరెట్ల అక్రమ వ్యాపారం దుమారం రేపుతోంది. గత వారమే రెండు షాపులపై పోలీసులు చేసిన దాడుల్లో భారీగా ఈ–సిగరెట్లు లభ్యమవగా.. తాజాగా డాబాగార్డెన్స్‌లోని జపాన్ ప్లాజాలో ఈ–సిగరెట్లను పోలీసులు గుర్తించారు. సుమారు రూ.3.76 లక్షలు విలువ చేసే 21 ఈ–సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడ్ని అరెస్టు చేశారు. జపాన్ ప్లాజాలో అక్రమంగా విదేశీ సిగరెట్లు ఉన్నాయని పోలీసులకు సమాచారం అందింది. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు రెండో పట్టణ ఎస్ఐ కె.శంకర్‌రావు తన సిబ్బందితో కలిసి మంగళవారం షాపులో తనిఖీలు నిర్వహించారు. లోపల 21 నిషేధిత ఈ–సిగరెట్, అక్రమ విదేశీ సిగరెట్ ప్యాకెట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.3.76 లక్షల వరకు ఉంటుంది. చెంగళరావుపేట ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖాదర్ 35 ఏళ్ల నుంచి డాబాగార్డెన్స్ ప్రాంతంలో జపాన్ ప్లాజా షాపును నిర్వహిస్తున్నాడు. బ్యాగులు, పెర్ఫ్యూమ్‌లు, ఇతర సామగ్రిని విక్రయిస్తుంటాడు. అధికంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో చెన్నై, ముంబయి నుంచి నిషేధిత ఈ–సిగరెట్లను తీసుకువచ్చి షాపులో విక్రయిస్తున్నాడు. దీంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

గతంలో పట్టుబడిన నిందితుడు: జపాన్ ప్లాజా నిర్వాహకుడు గతంలో అక్రమంగా విదేశీ సిగరెట్లు విక్రయిస్తుండగా పోలీసు, విజిలెన్స్ అధికారుల దాడుల్లో రెండుసార్లు పట్టుబడ్డాడు. గత ఏడాదిలో కూడా విజిలెన్స్ అధికారులు జపాన్ ప్లాజాపై చేసిన దాడుల్లో భారీగా విదేశీ సిగరెట్లు గుర్తించారు. అయినప్పటికీ మార్పు లేకుండా మరోసారి ఈ–సిగరెట్ల విక్రయాలతో దొరికాడు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..


వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన పార్టీ యువత, మహిళలతో ఆడారి ఆనంద్‌కుమార్

200 మంది యువకులు, మహిళల చేరిక

మల్కాపురం: జనసేన పార్టీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. 58వ వార్డు క్లస్టర్ యూత్ అధ్యక్షుడు బర్రె సంతోష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కండువాలు కప్పి, ఆహ్వానించారు. గుల్లలపాలెం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పవన్ జనసేన పార్టీ పెట్టి తొలుత వామపక్షాలతో, అనంతరం టీడీపీ, బీజేపీ ఇలా పలు పార్టీలతో జత కట్టి నిలకడ లేని విధానాలను అనుసరిస్తూ పార్టీ క్యాడర్‌ను తప్పుదోవ పట్టించారన్నారు. పవన్‌ను నమ్ముకుని భూములు, ఆస్తులు అమ్ముకున్న చాలామందికి పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో వారు నేడు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. పార్టీని నమ్ముకుని పని చేసే కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేయని వ్యక్తి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ఆలోచన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన పార్టీకి కచ్చితంగా టీడీపీకి లేదా బీజేపీకి విలీనం చేస్తారని, అది గ్రహించే కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీని నమ్ముకుని పని చేసిన ప్రతీ ఒక్కరికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పార్టీ పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి, కార్పొరేటర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ కేసుల 'మిస్టరీ'

- పోలీసులకు కాసులు కురిపిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు
- బ్రీత్ అనలైజర్‌లో రికార్డయిన కేసులు మాయం
- డబ్బులు తీసుకొని వదిలేస్తున్న కొందరు పోలీసులు

డాబాగార్డెన్స్: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పోలీసులకు కాసులు కురిపిస్తున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపి దొరికిన వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. కేసు లేకుండా చేయడానికి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వసూలు చేస్తూ మందుబాబులను రోడ్ల మీదకు వదిలేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారి కారణంగా నగరంలో అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో నగరంలో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రతి జంక్షన్‌లోను ఆయా స్టేషన్ అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5.21 గంటలకు వన్‌టౌన్ ప్రాంతంలో థామ్సన్ స్ట్రీట్‌లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష చేయగా అందులో 97 ఎంజీగా నమోదైంది. మద్యం తాగినట్టు తేలడంతో కేసు నమోదు చేస్తామని ఆటోడ్రైవర్‌కు పోలీసులు చెప్పారు. కేసు లేకుండా చేయాలంటే రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంత ఇవ్వలేనని వేడుకున్నా అంగీకరించకపోవడంతో సదరు ఆటోడ్రైవర్ రూ.10 వేలు సమర్పించుకున్నట్లు సమాచారం. వాస్తవానికి బ్రీత్ అనలైజర్‌లో మద్యం తాగినట్లు రికార్డు అయితే తప్పనిసరిగా కేసు నమోదు చేసి కోర్టుకు పంపించాల్సి ఉంటుంది. కానీ డబ్బులు తీసుకొని రికార్డయిన కేసులను సైతం కోర్టుకు పంపించకుండా వ్యవహారం నడిపిస్తుండడం గమనార్హం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. దీనిపై విచారణకు ఆదేశించే అవకాశాలు ఉన్నాయి.

విష్ణుకుమార్‌రాజు కోడ్ ఉల్లంఘన!


కండువాతో ఆలయంలో పూజలు చేస్తున్న విష్ణుకుమార్ రాజు

మద్దిలపాలెం: పట్టాభిరెడ్డితోట ప్రాంతంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు మంగళవారం పార్టీల కండువాలను ధరించి పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఆలయాల్లో రాజకీయాలు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆలయంలో తీయించుకున్న ఫొటోలకు పార్టీ గుర్తును జతచేసి.. పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారని ఆరోపించారు. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.3,92,500 నగదు పట్టివేత

కూర్మన్నపాలెం: అగనంపూడి టోల్‌గేటు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద మంగళవారం ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో తుని నుంచి విశాఖ వస్తున్న కారులో కోరుకొండ ఈశ్వర్ గణేష్, సూరంపూడి చంద్రశేఖర్ వద్ద రూ.3,92,500 నగదు లభ్యమైంది. ఈ నగదుకు సంబంధించి వారి వద్ద పత్రాలు ఉన్నప్పటికీ.. వారు సరైన సమాధానం చెప్పలేకపోయారు. థాయిలాండ్ వెళ్లేందుకు భారతీయ కరెన్సీని థాయ్ బాట్‌గా ఎక్స్ఛేంజ్ చేసేందుకు విశాఖ వెళ్తున్నట్లు వారు చెప్పారు. నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పత్రాలను పరిశీలిస్తున్నారు.


మెరైన్ ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుం తగ్గింపు

ఏప్రిల్ నుంచి స్కూబా డైవింగ్, మెర్మైడ్ షో

ఏయూక్యాంపస్: నగర ప్రజలను అలరించేందుకు నూతన హంగులతో మెరైన్ ఎగ్జిబిషన్ సిద్ధం చేసినట్లు నిర్వాహకుడు రాజరెడ్డి తెలిపారు. బీచ్‌రోడ్డులోని ఎగ్జిబిషన్ ప్రాంగణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుంను రూ.150 నుంచి రూ.100కి తగ్గించామని వెల్లడించారు. ఇప్పటివరకు విదేశాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న మెర్మైడ్ షోను విశాఖ వాసులకు పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. స్పెయిన్‌కి చెందిన యువతులు ఇందులో పాల్గొంటారన్నారు. నీటి అడుగు భాగంలో ఈత కొడుతూ చిన్నారులకు సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తారన్నారు. స్కూబా డైవింగ్ చేసే అవకాశాన్ని కూడా కల్పిస్తామన్నారు. అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ ఎక్వేరియం, పక్షులు, పెంపుడు జంతువుల ప్రదర్శనకు అదనపు ఆకర్షణగా స్కూబా డైవింగ్, మెర్మైడ్ షోలు నిలుస్తాయన్నారు. వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏప్రిల్ మొదటి వారంలో ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు. ఒకే టికెట్‌పై టన్నెల్ ఫిష్ అక్వేరియం, పక్షి ప్రపంచం, స్కూబా డైవింగ్‌లను వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విశాఖ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాత సామాజిక వర్గానికి వైఎస్సార్‌సీపీ అండ

ఏపీ యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత


మాట్లాడుతున్న పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం: యాత సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని ఏపీ యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత తెలిపారు. మంగళవారం నరసింహనగర్‌లోని ఆమె నివాసం వద్ద ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో సుజాత మాట్లాడారు. ఇప్పటికే ఎన్నో సమస్యలు పరిష్కరించదని, మరికొన్ని సమస్యలు త్వరలోనే ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. పిల్లి నూకరాజు మాట్లాడుతూ బీసీ కులవృత్తుదారులకు వృత్తి లేని సమయాల్లో ఏడాదికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లే రాష్ట్రంలోని కల్లుగీత కార్మికులకు కూడా జీవనభృతిని ప్రకటించి ఆదుకోవాలని కోరారు. యాత నాయకులు కొల్లి సింహాచలం, సంపంగి మంగరాజు, వనుము దేముడు, నొల్ల శేఖర్, కొలుసు సత్యం, దమ్ము రమణ, సిమ్మా గోవింద్, రెడ్డి సన్యాసిరావు, పెంకే మారేష్, కోసెట్టి రమణ, పోలవరపు సత్తిబాబు, కొరెట్ల అప్పలరాజు, లావేటి నాగరాజు, బసరమాని ఈశ్వర రావు, గొడ్డు కన్నారావు పాల్గొన్నారు.

శ్రీపుష్పయాగంతో ముగిసిన అనంతుని కల్యాణోత్సవాలు

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి శ్రీ పుష్పయాగంతో ముగిశాయి. ముందుగా ద్వాదశ సేవ నిర్వహించారు. తదుపరి శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలకు శ్రీపుష్పయాగం నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

'సమతా'కు బినా స్టేషన్‌లో హాల్ట్ సమయం కుదింపు

తాటిచెట్లపాలెం: భోపాల్ డివిజన్ బినా స్టేషన్‌లో సమతా ఎక్స్‌ప్రెస్ హాల్ట్ సమయాన్ని కుదించారు. ఏప్రిల్ 5, 6, 8, 9, 11, 12, 13, 15, 16, 18, 19, 20, 22, 23, 25, 26, 27, 29, 30, మే 2, 3, 4, 6, 7, 9, 10, 11, 13, 14వ తేదీల్లో హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్ ఐదు నిమిషాలకు బదులుగా కేవలం రెండు నిమిషాలే ఆగుతుందన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే ముస్లింలకు మేలు

- సాధిక్ వ్యాఖ్యలు అతని దిగజారుడు తనానికి నిదర్శనం
- పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు కె.వి.బాబా


మాట్లాడుతున్న జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు కె.వి.బాబా

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై జనసేన నాయకుడు మహమ్మద్ సాధిక్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు కె.వి.బాబా తీవ్రంగా ఖండించారు. అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు చంద్రబాబు హయాంలో కంటే సీఎం జగన్ ప్రభుత్వంలో మేలు జరిగిందని, కీర్తించి పూల వర్షం కురిపించిన సాధిక్.. పార్టీ మారగానే వైఎస్సార్ సీపీ పాలనపై విమర్శలు చేయడం అతని దిగజారుడు తనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీలో ఉన్నప్పుడు ఏపీ పొల్యూషన్ బోర్డు కంట్రోల్ సభ్యుడిగా పదవి పొంది.. ఈ రోజు విమర్శించడం తగదన్నారు. చంద్రబాబు హయాంలో ఇచ్చిన నాసిరం రంజాన్ తోఫా, చాలీచాలని షాదీ ముబారక్‌తో ముస్లింలు ఏం అభివృద్ధి చెందారని ప్రశ్నించారు. సీఎం జగన్ వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మైనార్టీల సంక్షేమం కోసం రూ.2,665 కోట్లు ఖర్చు చేస్తే, సీఎం జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 23,168 కోట్లు ఖర్చు చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో 50 లక్షలకు పైగా మైనార్టీలు లబ్ధి పొందారని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ముస్లింలను గౌరవించారన్నారు. టీడీపీ హయాంలో దుల్హన్ పథకం కింద రూ.50 వేలు ఇస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దానిని లక్షకు పెంచిందన్నారు. 45 ఏళ్ల పైబడిన 2.20 లక్షల మంది ముస్లిం అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత ద్వారా ఆర్థిక సాయం అందజేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇమామ్‌లకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.3 వేల నుంచి రూ.5వేలకు పెంచారని వివరించారు. నాసిరకం రంజాన్ తోఫా ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేసిన సీఎం జగన్‌పై విమర్శలు మానకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మగబూల్‌ం నవాబ్, వైస్ ప్రెసిడెంట్ ముస్తఫా, జిల్లా మైనార్టీ సెక్రటరీ మహమ్మద్ మునీర్ ఖాన్, జిల్లా సెక్రటరీ నిజాం, జీఎస్‌కే హుస్సేన్ పాల్గొన్నారు.